# సర్కారు బడుల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్

- విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం
- ఉత్తనూర్‌లో ప్రారంభం

అయిజ, నవంబర్ 1 : తెలంగాణప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చింది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఎన్నో గొప్ప సంస్కరణలు అమలు చేస్తుంది. చక్కని చదువు కోసం ఉదయాన్నే విద్యార్థుల కడుపు నింపాలన్న గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం గత నెల 6న సర్కారు బడుల్లో శ్రీకారం చుట్టింది. విడుతల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం కేసీఆర్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బుధవారం మండలం లోని ఉత్తనూర్ జెడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం తిమ్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని ఉదయం పూట విద్యార్థులకు అందించడం వల్ల తరగతి గదుల్లోమరింత చురుగ్గా వ్యవహరించే వీలుందన్నారు. బలవర్ధకమైన అల్పాహారంతో భావితరాలు ఆరోగ్యంగా ఉండాలని, తెలంగాణలో పౌష్టికాహార లోపం ఆనవాళ్లను నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకటో నుంచి పదో తరగతి విద్యార్థులందరికీ పథకం వర్తిస్తుందన్నారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వేశ్వర చారి, ఏబేలు, అరుణ, రవి, శ్యాంసన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ఉత్తనూర్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం తిమ్మారెడ్డి

## అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



రామాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న విజేయుడు

వడ్డేపల్లి, నవంబర్ 1 : బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, చేపట్టిన పథకాలను చూసి కారు గుర్తుకు ఓటెయ్యాలని కోరుతూ మండలం లోని రామాపురం, బుడమొర్సు గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు విజేయుడు ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి నడుం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సహకార సంఘ ఉపాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, గజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ శేషిరెడ్డి, సత్యారెడ్డి, నాగిరెడ్డి, జహంగీర్ బాషా, చాంద్, పెద్ద హుస్సేన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో కేసు నమోదు

రాజోళి, అక్టోబర్ 1 : ఎన్నికల కోడ్ ఉల్లంఘనతో మండల కేంద్రంలో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ ఖాదర్ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం ప్రకారం మంగళవారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెయిల్ మంజూరీతో టీడీపీనేతలు ర్యాలీ నిర్వహిస్తూ టపాసులు కాల్చారు. అనుమతిలు లేకుండా ర్యాలీతో ప్రజాశాంతి భగం కలిగిస్తూ రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తూ,ప్రజలకు ఆసౌకర్యం గురి చేసినందుకు 10మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కానిస్టేబుల్‌గా ఎంపికైన వారిని సన్మానించిన పూర్వ విద్యార్థులు

మానవపాడు, నవంబర్ 1 : పోలీస్ కానిస్టేబుల్‌కు ఎంపికైన యువకులను 2001-02 పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఇటీవల వెలువడిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో అర్హత సాధించిన 11 మంది యువకులకు బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై రాముతో కలసి పూర్వపు విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు సహాయపడాలనే ఉద్దేశంతో తమవంతుగా రూ.10వేలు ఆర్థికసాయం అందిస్తున్నామని పూర్వపు విద్యార్థులు తెలిపారు. వీటిని విద్యార్థుల చదువులకు ఉపయోగపడే విధంగా చూడాలని హెచ్‌ఎం కోరారు.

## మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంబాటిళ్లతో పోలీసులు

అలంపూర్, నవంబర్ 1 : అలంపూరు నుంచి తుంగభద్రా నదీ వంతెన మీదుగా జిల్లెలపాడు గ్రామం వైపు బైక్‌పై తరలిస్తున్న మద్యాన్ని వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం పోలీసులు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. రూ.44వేల విలువ చేసే మద్యం బాటిళ్ళను, బైక్‌ను స్వాధీనం చేసుకుని జిల్లెలపాడుకు చెందిన మద్దిలేటిపై కేసు నమోదు చేసినట్టు ఎసై రమేశ్ తెలిపారు.

## మేకలకు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు

వడ్డేపల్లి, నవంబర్ 1 : మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో బుధవారం మండల పశువైద్యాధికారి పుష్పలత ఆధ్వర్యంలో మేకలకు, గొర్రెలకు ఉచితంగా పీపీఆర్ టీకాలను వేశారు. 1538 గొర్రెలకు, 1689 మేకలకు టీకాలు వేశామని జీవాలు వున్న ప్రతిఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది లతీఫ్, రవికిరణ్, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



అలంపూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎఫ్‌ఎస్టీ టీమ్ సభ్యులు

ఉండవెల్లి, నవంబర్ 1 : మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఎఫ్‌ఎస్‌టీ టీమ్ సభ్యులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులను తరలించే వాహనాలపై నిఘా ఉంచి క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి ఇస్తున్నామని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో మద్యం, డబ్బుల పంపిణీపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ సందర్భంగా వీడియో రికార్డుతో పాటు ప్రత్యేక వాహనానికి అమర్చిన సీసీ కెమెరాల్లో రికార్డు చేస్తున్నామన్నారు.

**అయిజలో..**

అయిజ, నవంబర్ 1 : ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రహదారులపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బుధవారం పట్టణం లోని కర్నూల్, రాయిచూర్, నాగల్‌దిన్నె రహదారులపై వెళ్తున్న వాహనాలను ఎస్సై నరేశ్ కుమార్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రూ.50 వేల మించి నగదు, మద్యం తరలించినా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మూడు రాష్ర్టాలకు సరిహద్దుగా అయిజ పట్టణం ఉండటంతో రహదారులపై పోలీసులతో గస్తీ ముమ్మరం చేశామని ఎస్సై తెలిపారు. అధికంగా నగదు, బంగారును తరలిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు.

**ఎర్రవల్లి చౌరస్తాలో..**

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 1 : మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు ఎర్రవల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా అక్రమంగా నగదు, మద్యాన్ని తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

## వాడివేడీగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖాధికారి

మానవపాడు, నవంబర్ 1 : గ్రామాల్లో సమస్యలను పరిష్కరించలేని సమావేశాలు ఎందుకని మండల ప్రాదేశిక సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రం లోని మండల పరిషత్ సమావేశం వాడివేడీగా జరిగింది. ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలు విన్నవించినా అధికారులు అలసత్వం వహిస్తున్నారని అమరవాయి ఎంపీటీసీ రోశన్న అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వ దవాఖానలో రక్తపరీక్షల సమయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వాటిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా దవాఖాన సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్మశాన వాటికకు విద్యుత్త్ కనెక్షన్ నిమిత్తం డీడీ చెల్లించినప్పటికీ నేటివరకు కనెక్షన్ ఇవ్వలేదని అధికారులపై మండిపడ్డారు. గ్రామంలో ఇండ్ల మీదుగా విద్యుత్తు వైర్లు వెళ్తున్నాయని వాటిని తొలగించాలని కోరినా నేటీవరకు తొలగించలేదన్నారు. ఎంపీపీ అశోక్‌రెడ్డి చొరవ తీసుకొని విద్యుత్ సమస్యలు తీర్చాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే దిశలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శివప్రసాద్, తాసీల్దార్ జుబేర్ మైనొద్దీన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఆత్మహత్య



శరణప్ప (ఫైల్)

అయిజరూరల్, నవంబర్ 1 : పురుగుల మందు సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఈడిగోనిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈడిగోనిపల్లికి చెందిన గొల్ల శరణప్ప(35) వ్యవసాయకూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై తాగిన మత్తులో మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

## ఆర్డీఎస్‌లో తగ్గిన నీటిమట్టం

అయిజ, నవంబర్ 1 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి మట్టం తగ్గుతోంది. బుధవారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిల్ ఉండగా, అవుట్‌ఫ్లో 135 క్యూసెక్కులు నమోదైనట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 115 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.3 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**- టీబీ డ్యాంలో 32.155 టీఎంసీల నిల్వ**

కర్ణాటకలోని తుంగభద్రా డ్యాంలో ప్రస్తుతం 32.155 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 9,017 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 32.155 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి, ప్రస్తుతం 1607.07 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.